క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆచంట నియోజకవర్గ నాయకులు

పెనుగొండ: తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆచంట నియోజకవర్గ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర నాయకుడు వైట్ల కిషోర్‌కుమార్, నాయకులు మనవర్తి విజయ్ కుమార్, మడిమెట్ల నరేష్ ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



ఎస్.సుబ్బన్నరెడ్డి

నరసాపురం: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు సర్వీస్‌లకు సంబంధించిన సమస్యలు, కార్గో సేవలు, కార్గో డోర్ డెలివరీ సేవలు, ప్రత్యేక బస్సులు, బస్సుల బుకింగ్స్ కోసం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486 నెంబర్‌కు తెలియజేయాలని చెప్పారు. ప్రయాణికుల ఫిర్యాదులు, సలహాలు, సూచనలకు తగిన పరిష్కారం చూపిస్తామని చెప్పారు.

ఎంపీపీను కలిసిన ఉపాధ్యాయులు



ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్‌తో ఉపాధ్యాయులు

యలమంచిలి: ఎంపీపీగా ఎన్నికైన ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్‌ను బుధవారం ఏనుగువానిలంక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆమెను కలసిన వారిలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్‌వీ అవధాని ఉపాధ్యాయులు బొక్కా విజయపద్మ, త్సవటపల్లి నారాయణమూర్తి, ఇందుకూరి వేణుగోపాలరాజు, తోలేటి గాంధీ, మోకా ముత్యాలరాజు, ఏలూరి చల్లారావు రిటైర్డ్ టీచర్స్ పిప్పళ్ల రంగారావు, అబ్బులు ఎస్ఎంసీ చైర్మన్ నారిన వెంకట రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర



తిరంగ యాత్రలో పాల్గొన్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పిన మన సైనికుల పోరాటం మరువలేనిదని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక యడ్ల బజారు సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర గాంధీబొమ్మల సెంటర్ వరకూ కొనసాగింది. పార్టీలు, వర్గాలకు అతీతంగా ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 200 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీలో ప్రదర్శన చేశారు.

విద్యార్థులకు సత్కారం

పెనుమంట్ర: నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో 2024-25లో విద్యాసంవత్సరానికి గాను పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు 13 మంది ఉపాధ్యాయులకు బుధవారం పెనుమంట్ర మండలం వెలగలేరు గ్రామంలోని శుభమస్తు కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలో ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, తణుకు, పోడూరు, ఇరగవరం, నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి మండలాలకు చెందిన మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. ముఖ్యం అతిథిగా పాల్గొన్న తణుకు డీవైఈవో మురళీసత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతస్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. పెనుమంట్ర ఎంఈఓ -2 ఉంగరాల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ-1 లక్ష్మీనారాయణ, జిల్లా గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ, పాలా ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

భీమవరం: ఒకటో పట్టణంలోని నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.దుర్గారావు (22) ఆచూకీ ఈ నెల 4 నుంచి తెలియరాలేదని అతడి సోదరుడు నాగరాజు బుధవారం ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. వేరే వ్యక్తితో గొడవల కారణంగా ఎటో వెళ్లిపోయినట్లు భావిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వాహన రాకపోకల పునరుద్ధరణ ఎప్పుడో?



పెనుగొండ-నెగ్గిపూడి మధ్యలో కొనసాగుతున్న కల్వర్టు పనులు



పెనుగొండ ఫ్లైఓవర్ మరమ్మతులు



పెనుగొండలో కిక్కిరిసిన బజారు రోడ్డు

ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులు

పెనుగొండ: పెనుగొండ-మార్టేరు రహదారిలో వాహనాల రాకపోకల పునరుద్ధరణకు వరుణుడు అడ్డంకిగా మారుతున్నాడు. మండు వేసవిలోనూ వర్షాలు పడుతుండడంతో నిర్ణీత సమయంలో నెగ్గిపూడిలో కల్వర్టు, పెనుగొండలో ఫ్లైఓవర్ పనులు పూర్తి కావడం ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. నెగ్గిపూడి వద్ద రూ.59 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు, పెనుగొండ ఫ్లైఓవర్ మరమ్మతులు రూ.45 లక్షలతో చేపట్టారు. దీని నిమిత్తం మార్టేరు నుంచి పెనుగొండ వైపు వాహనాలు రాకపోకలను ఏప్రిల్ 28 నుంచి నిలిపి వేశారు. అధికారుల అంచనాల ప్రకారం జూన్ 10 నాటికి రెండింటి నిర్మాణాలు పూర్తిచేసి పూర్తి స్థాయిలో రాకపోకలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అయితే గత 10 రోజులుగా మధ్యమధ్యలో భారీ వర్షం పడుతుండడంతో పనులు మందకోడిగా సాగుతున్నాయి. అధికారులు మరమ్మతు పనులు పరిగెట్టించాలని ప్రయత్నిస్తున్నా వరుణుడు మాత్రం అడ్డంకిగా మారుతున్నారు. దీంతో పెనుగొండ వచ్చే వాహనాలు మార్టేరు, శేషమ్మ చెరువు, కొఠాలపర్రుల మీదుగా రావాల్సి వస్తుంది. పెనుగొండ నుంచి భీమవరం వైపు వెళ్లడానికి కాకిలేరు, కొయ్యేటిపాడు, ఆలమూరుల మీదుగా వెళ్లాల్సి వస్తుంది. పరిసర ప్రాంతాల్లో పెనుగొండ ఇటు విద్యాపరంగానూ, అటు వాణిజ్యపరంగాను అభివృద్ధి చెందింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు నిత్యం పెనుగొండ వస్తుంటారు. రాకపోకల నిషేదంతో వారు నానా అవస్థలు పడుతున్నారు.

బస్సు వచ్చి నెల రోజులవుతుంది

ఇదిలా ఉండగా పెనుగొండకు ఆర్టీసీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. పెనుగొండ వాసులు ఆర్టీసీ బస్సు చూసి నెలరోజులు కావస్తుంది. ఆర్టీసీ బస్సుకు వెళ్లాలంటే ఇటు సిద్ధాంతం, అటు మార్టేరు, మరోపక్క పెరవలి వెళ్లాల్సి వస్తుంది. వరుణుడు అడ్డంకితో జూన్ మధ్య వారంలో గాని ఆర్టీసీ బస్సు పెనుగొండ వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో పెనుగొండ ప్రజలు మరో నెల రోజుల పాటు ప్రయాణాలకు కష్టాలు పడాల్సిందే.

కిక్కిరిసిపోతున్న పెనుగొండ ప్రధాన రహదారి

పెనుగొండ ఫ్లైఓవర్ మరమ్మతులు జరుగుతుండడంతో వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రతి వాహనం పెనుగొండ ప్రధాన రహదారి అయిన బజారు రోడ్డులో వెళ్లాల్సి వస్తుంది. బజారు రోడ్డులో ఇరువైపులా వాణిజ్య సముదాయాలు, దీనికి తోడు ఫుట్‌పాత్ వ్యాపారాలు ఎక్కువగా ఉండడంతో బజారు రోడ్డులోకి వెళ్లాలంటే చాలు వాహనదారులు హడలిపోతున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు అష్టకష్టాలు పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి ఫ్లై-ఓవర్, కల్వర్టులు త్వరగా పూర్తి చేయడం ద్వారానే అవుతుంది. వరుణుడు కరుణించి నిర్మాణాలకు ఆటంకం కల్పించకపోతే త్వరలోనే రాకపోకలు పునరుద్ధరించే అవకాశం ఉంటుంది.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పెనుగొండ: ఆచంట పెదపేట చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. యువకులు ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో పితాని వెంకట్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎస్సై వెంకట రమణ, బీరా నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు తిరంగా యాత్ర

పెనుగొండ: భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సందర్భంగా ఆచంట నియోజకవర్గంలో గురువారం తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆచంట శాసనసభ్యుడు పితాని సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. మధ్యాహ్నం 3 గంటలకు పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరం నుంచి మార్టేరు మీదుగా ఆచంట, కోడేరు వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఎంబ్రాయిడరీ కోర్సుకు ఉచిత శిక్షణ

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీఐ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంయుక్త ఆధ్వర్యంలో సంప్రదాయ చేతి ఎంబ్రాయిడరీ కోర్సు రెండు నెలల ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 31లోపు కళాశాలకు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రు. శిక్షణ పూర్తయిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గుర్తింపు పొందిన ధ్రువీకరణ పత్రం అందిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 95735 28272 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు



పంచముఖ ఆంజనేయస్వామి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ జయంతి ఉత్సవాలు సందర్భంగా బుధవారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గురువారం హనుమద్ జయంతి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం వరకూ ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఐదు రోజులు పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ సామూహిక సహస్రనామార్చనలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు రమణ స్వామి తెలిపారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద కొలువై ఉన్న దాసోహ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ జయంతి సందర్భంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ సామూహిక సహస్రనామార్చనలు జరపనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. ఉదయం పూజా కార్యక్రమాలు రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్నారు.

దివ్యాంగుడిని తొలగించడం దారుణం



ఆచంటలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు

పెనుగొండ: 90 శాతం వికలాంగత్వం ఉంటే దివ్యాంగులు ఉద్యోగాలకు పనికిరారనడం దారుణమని, ఆచంట ఉన్నత పాఠశాలలో దివ్యాంగ వాచ్‌మెన్ చదలవాడ ముత్యాలరావును తొలగించడం దారుణమని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బత్తిని చిట్టిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆచంట పెదపేటలో నిర్వహించిన స్నేహ భారతి వికలాంగుల సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. చదలవాడను తొలగించిన నోటీస్‌ను హైకోర్టు రద్దు చేసినా, అప్పటి నుంచి విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. తొలగింపులో సంబంధం లేదని ఎంఈవో అంటూనే, కమిటీ పరిశీలన చేసి తొలగించారంటూ తప్పుడు ప్రకటన ఇచ్చారన్నారు. తక్షణం ఆరోపణలు రుజువు చేయాలని లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాండ్రేకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రితో ఆధిపత్య పోరు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో సేవా సంస్థ పేరుతో నడుస్తున్న ఆ కంటి ఆసుపత్రికి నలత చేసినట్లుంది. గత 20 రోజులుగా ఆ సంస్థలో ఆధిపత్యపోరు నడుస్తుందని పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చ నడుస్తుంది. సామాజిక వర్గాలుగా విడిపోయే ప్రమాదం కనిపిస్తుందని ఈ ఆసుపత్రి సంస్థ పెద్దలు సందేహంలో పడినట్లు సమాచారం. అసలు విషయానికి వస్తే ఆ ఆసుపత్రి సభ్యులు సుమారు 135 మంది వరకూ ఉన్నారు. గత కొంతకాలం క్రితం ఆ ఆసుపత్రికి కొందరు పెద్దలు ఓ పెద్దాయనను చైర్మన్‌గా నియమించినట్లు చెబుతుంటారు. అయితే ఆ సంస్థలో పని చేసే సిబ్బంది తొలగింపుతో వివాదం రాజుకుంది. చైర్మన్ తీరుపై ఇతర సభ్యులు ప్రశ్నించే సరికి ఆగ్రహించిన ఆయన రాజీనామా లేఖ ఇచ్చారు. అయితే ఆయన సామాజిక వర్గానికి చెందిన మరో 20 మంది సభ్యులు రాజీనామా చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో సమస్య మరింత ముదిరింది. అయితే సంస్థ అబాసుపాలు కాకూడదనే ఉద్దేశంతో తిరిగి ఆయనే చైర్మన్‌గా ఉండాలని నిర్ణయం తీసుకోవడంతో ఆయనే కొనసాగుతున్నారు. ఇప్పటికైనా సదరు చైర్మన్ గారి తీరు మారుతుందో? లేదో? వేచి చూడాలని సంస్థ సభ్యులు పేర్కొంటున్నారు.

వీకెండ్ మంత్రి గారూ.. మీ స్థాయి తెలుసా?



ఉచ్చుల స్టాలిన్‌బాబు

యలమంచిలి: వీకెండ్ మంత్రి నిమ్మల రామానాయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థాయి వ్యక్తిని విమర్శించే ముందు తన స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఉన్న మాటంటే ఉలుకెక్కువనే చందాన ఎన్నికల సమయంలో రామానాయుడు పల్లవించిన మాటలనే జగన్ మోహన్‌రెడ్డి ఉటంకిస్తే రామానాయుడికి చిర్రెత్తుకొచ్చిందని స్టాలిన్‌బాబు విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన ఏడాది కాలంలోనే తన ఎన్నికల హామీలు నవరత్నాలు నూరు శాతం అమలు చేశారన్నారు. మీ చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏడాది కాలంలో ఎన్ని అమలు చేశారో మీ విజ్ఞతకే వదులుతున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిన మీకు జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత ఉందా అని స్టాలిన్‌బాబు ప్రశ్నించారు.

గ్రంథాలయంలో ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం



జెండా వందనం చేస్తున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడుల్లో అమాయకులైన టూరిస్టులు బలైపోయారని రిటైర్డ్ ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సత్యనారాయణ మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు పోకుండా సక్రమమైన మార్గంలో నడుచుకోవాలన్నారు. సమ్మర్ క్యాంపుల్లో భాగంగా గ్రంథాలయంలో యోగా, ఆకులతో బొమ్మలు, బుట్టలు, చాపలు తయారు చేయడం నేరింపించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి, కె.సూర్యకుమార్, వేదాంతం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల సహాయ కేంద్రం ప్రారంభం



ఉపాధ్యాయ బదిలీల సహాయ కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో ఉపాధ్యాయులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఉపాధ్యాయ బదిలీల సహాయ కేంద్రాన్ని బుధవారం యూటీఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకెవి రామభద్రం ప్రారంభించారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్లవానిగరువు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న నెట్ సెంటర్‌లో ఈ కేంద్రం ఏర్పాటుచేశారు. బదిలీలకు సంబంధించి ఏ విధమైన సహాయం కావాలన్నా ఉపాధ్యాయులు ఈ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శి దండు పద్మావతి, మండల శాఖ అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు వి జగ్గారావు, ఉపాధ్యక్షులు కుడుపూడి సత్యనారాయణ, కోశాధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు పూర్ణ

కాళ్ల: రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురించిఇ చులకనగా మాట్లాడినా, దుర్భాషలాడినా సహించేది లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు బంధన పూర్ణచంద్రరావు హెచ్చరించారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు చెప్పగానే రాష్ట్రంలో అనేక మంది పేద ప్రజలు తమ ఆశాజ్యోతిగా గర్వంగా పిలుచుకుంటారన్నారు. అటువంటి మహా వ్యక్తిని జిల్లాలో ఒక మంత్రి బాధ్యత మరిచి దుర్భాషలాడటం బాధాకరమన్నారు. మంత్రి బాధ్యత లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడిన తీరు చాలా బాధాకరమన్నారు. మంత్రి రామానాయుడు పబ్లిసిటీ కోసం ఏమైనా చేస్తారని, ఏమైనా మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. మంత్రి ఆయన బాధ్యతను నిర్వర్తించి ప్రజలకు మేలు చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిని ఒక మంత్రి చులకనగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. భవిష్యత్తులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకోమని ప్రతిఘటిస్తామని తెలిపారు. భీమవరం పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు మాట్లాడుతూ నిమ్మల రామానాయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడిన పదజాలం చాలా అభ్యంతరకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నియోజకవర్గంలో ఏం చేస్తున్నారో అందరికీ తెలుసునని రాజకీయ నాయకులను బెదిరించటం అరెస్టులు చేయించడం వంటి పనులు చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని ఇకనైనా మంచి మనసుతో పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు.

పీఎం సహాయ నిధికి రూ.10 వేల అందజేత



సహాయ మొత్తాన్ని ఆర్డీఓ దాసి రాజుకు అందిస్తున్న ఉపాధి హామీ కూలీలు

నరసాపురం రూరల్: ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు తమ ఒక రోజు వేతనాన్ని (రూ.10వేలు) పీఎం సహాయ నిధికి అందించారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు విచ్చేసిన రెవిన్యూ డివిజన్ అధికారి దాసిరాజుకు అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైనిక సహాయనిధికి ఈ సొమ్మును అందజేయాలని ఉపాధి కూలీలు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ బాబులు, ఎంపీడీఓ జీవీఎస్ గాదిరాజు రామకృష్ణంరాజు, తహసీల్దార్ ఐతం సత్యనారాయణ, ఏపీడీ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజీబీఎస్ కళాశాల వ్యవహారాల్లో అవకతవకలు లేవు



మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్


నరసాపురం: పద్మశ్రీ అద్దేపల్లి సర్వారెట్టి స్థాపించిన బీజీబీఎస్ మహిళా కళాశాల వ్యవహారాల్లో ఎలాంటి అవకతవకలు జరగడంలేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగా బురద జల్లుతున్నారని కళాశాల పాలకవర్గం వివరణ ఇచ్చింది. బుధవారం కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్నిరోజులుగా కొంతమంది కళాశాల ఆస్తులను అక్రమంగా అమ్ముకుంటున్నామని ఆరోపిచడంలో వాస్తవంలేదన్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, కళాశాల అభివృద్ధి కోసం కొంతస్థలం అమ్మామని చెప్పారు. న్యాయపరంగా ఆరోపణలు ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సమావేశంలో కళాశాల అధ్యక్షుడు నూలి రమణమూర్తి, ట్రెజరర్ తుమ్మలపల్లి వీరభద్రం, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సి.నీరజ పాల్గొన్నారు.

24న ప్రత్యేక సమావేశం

కాళ్ల: మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ అవిశ్వాస తీర్మానంపై 24న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.కమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఉపసర్పంచ్ మైలా శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు వార్డు మెంబర్లు భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు.

విద్యుత్ లైన్‌మెన్లు కావలెను

- బదిలీల్లో ఆకివీడు వద్దంటున్న సిబ్బంది
- 50 శాతం లైన్‌మెన్ పోస్టుల ఖాళీ
- నెలకు రూ.ఆరు కోట్ల ఆదాయం
- సరిపడే సిబ్బంది లేక ఆదాయానికి గండి



ఆకివీడు సబ్ స్టేషన్

ఆకివీడు: విద్యుత్ శాఖకు, ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న ఆకివీడు ప్రాంత విద్యుత్ వినియోగదారులకు సేవలందించేందుకు సరిపడా సిబ్బంది లేక నిత్యం ఇబ్బందులతో కాలం గడుపుతున్నారు. దుక్కి వర్షం కురిసినా, ఒక మోస్తరు ఈదురు గాలి వీచినా ఐదు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు లబోదిబోమంటూ విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్లు చేసినా ఫలితం ఉండటం లేదు. మండల, పట్టణ పరిధిలో 33,100కు పైగా విద్యుత్ సర్వీసులున్నాయి. 2088 ట్రాన్స్‌ఫార్మర్లు, ఐదు విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి మెయింటినెన్స్‌కు, వినియోగదారుల విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను తొలగించేందుకు 35 మంది లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, సహాయ లైన్‌మెన్లు, ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు పని చేయాలి. మండల పరిధిలోని విద్యుత్ శాఖకు సుమారుగా రూ.ఆరు కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. మరింత ఆదాయం పెరగాల్సి ఉండగా సరిపడా సిబ్బంది లేక గండి పడుతోంది. ప్రస్తుతం ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో కేవలం 50 శాతం కంటే ఎక్కువగా సిబ్బంది కొరత ఉంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మొత్తం 16 మంది లైన్‌మెన్లు మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరతతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురి కావడం, విద్యుత్ తీగలు తెగిపడటం, ఏబీ స్విచ్‌లు కాలిపోవడం వంటివి అధికంగా జరుగుతున్నాయి. మెయింటినెన్స్ లోపంతో విద్యుత్ సమస్యలు మండలంలో తారా స్థాయికి చేరుకున్నాయి. పలుచోట్ల ఓవర్ లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పేలిపోవడం వంటివి జరుగుతున్నాయి.

పట్టణంలోనూ ఇబ్బంది

స్థానిక నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆటంకం ఎదురవుతుంది. ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో సరఫరా నిలిచిపోతుంది. పట్టణంలో 19 మంది లైన్‌మెన్లకు 10 మంది పని చేస్తుండగా వారిలో 4 లైన్‌మెన్లు సబ్‌స్టేషన్‌లో షిఫ్టు పనులు నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆరుగురిలో ఇద్దరు అయిభీమవరం, చెరుకుమిల్లి, మరో ఇద్దరు కుప్పనపూడి, అజ్జమూరులో పని చేస్తుండగా టౌన్ పరిధిలో ఇద్దరు లైన్‌మెన్లు, ఎల్ఐ మాత్రమే పని చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ప్రైవేట్ లైన్‌మెన్ల వినియోగం

ప్రభుత్వ లైన్‌మెన్లుత లేక ప్రైవేట్ లైన్ మెన్లను చేపలు, రొయ్యల చెరువుల వద్ద వినియోగించుకోవలసి వస్తుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ తమకు విద్యుత్ సరఫరా నిలిచిపోతే పని చేసే లైన్‌మెన్లు లేకపోవడం దారుణమని వారు వాపోతున్నారు. ఇతర పరిశ్రమల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రభుత్వానికి కొంత సొమ్ము ఆదా అవుతుందనే ఉద్దేశ్యంతో లైన్‌మెన్ల నియామకం జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

బదిలీలు లీలలేనా?

ఈ నెలలో బదిలీల పర్వం ఉండగా విద్యుత్ శాఖలోని లైన్‌మెన్ల బదిలీలు కూడా లీలలేనా అని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఆకివీడు ప్రాంతానికి బదిలీపై రావడానికి కొంతమంది లైన్‌మెన్లు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఈ నెలలో జరుగనున్న బదిలీల్లో అయినా లైన్‌మెన్ల కొరత తీరుతుందో లేదో వేచి చూడాల్సిందే.